పుర ప్రజలకు.. భారీ ఊరట

- ఇళ్లు, ఖాళీ స్థలాల పన్ను బకాయిల చెల్లింపులకు ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్..
- నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ
- లేకుంటే నెలకు 2శాతం 'వడ్డీ'ంపు
- మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం

మొండి బకాయి దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఆస్తి(ఇంటి), ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని జీవో విడుదల చేసింది. దీంతో పన్ను చెల్లింపు దారులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పన్ను చెల్లించకుండా ఇబ్బంది పడిన పుర ప్రజల నుంచి.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



సత్తెనపల్లి పురపాలక సంఘ ముఖ ద్వారం

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలోని పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించింది. సకాలంలో ఆస్తి (ఇంటి), ఖాళీ స్థలాల పన్నులు చెల్లించని వారి నుంచి రెండు శాతం వడ్డీ వసూలు చేస్తారు. అయితే ఈ నెల 31లోగా మున్సిపాలిటీకి పాత, ప్రస్తుత బకాయిలు కలిపి చెల్లించిన వారిపై వడ్డీ భారాన్ని ఎత్తివేస్తూ పుర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఈ నెల 16న జీఓ నంబర్ 34 జారీ చేసింది. దీనివల్ల సత్తెనపల్లి పురపాలక సంఘం రూ.1.40 కోట్ల ఆదాయాన్ని కోల్పోతుంది. అయితే ప్రజలపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వడ్డీ భారాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరులోగా మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తే వన్ టైం సెటిల్‌మెంట్ కింద వడ్డీ మాఫీ చేస్తుంది. మున్సిపల్ అధికారులు పట్టణంలో దీనిపై విస్తృత ప్రచారం ప్రారంభించారు. ఈ నెలాఖరకు నూరు శాతం పన్నులు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ కూడా సద్వినియోగం చేసుకోకుండా అలక్ష్యం చేస్తే పన్ను బకాయిలపై నెలకు రెండు శాతం చొప్పున వడ్డీ విధిస్తారు. రాయితీ పొందితే వడ్డీ భారంతో పాటు బకాయిల నుంచి కూడా విముక్తి పొందుతారని అవగాహన కల్పిస్తున్నారు.

సత్తెనపల్లి లో రూ.1.40 కోట్లు వడ్డీ మాఫీ

- సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించి 15,690 అసెస్ మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా రూ. 7.31 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 10, 713 అసెస్ మెంట్లకు గాను రూ.4.21 కోట్లు వసూలు అయ్యాయి. ఇంకా 4,977 అసెస్ మెంట్లకు సంబంధించి రూ.3.14 కోట్లు రావాలి. దీనిలో వడ్డీ మాఫీ రూ.1.27 కోట్లు ఉంది.
- సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఖాళీ స్థలాల పనులకు సంబంధించి 869 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా రూ.64.91 లక్షలు రావాలి. ఇప్పటివరకు 525 అసెస్‌మెంట్లకు గాను రూ.25.81 లక్షలు వసూలు అయ్యాయి. ఇంకా 344 అసెస్ మెంట్లకు సంబంధించి రూ. 39.10 లక్షలు రావాలి. దీనిలో వడ్డీ మాఫీ రూ. 13.88 లక్షలు ఉంది.
- ఆస్తి పన్నులకు సంబంధించి రూ.1.27 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి రూ. 13.88 లక్షలు, మొత్తం రూ.1,40,88,000 పట్టణ ప్రజలకు వడ్డీ మాఫీ కానుంది.

వడ్డీ భారం దించుకునేందుకు మంచి అవకాశం



కారణాలు ఏవైనప్పటికీ కొంతమంది పన్నుల చెల్లింపులో జాప్యం చేశారు. వారందరూ ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరు లోపు పురపాలక సంఘానికి బకాయి పడిన పన్నులను పూర్తిగా చెల్లించి రాయితీ పొందాలి. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలి.

– చల్లంచర్ల లక్ష్మీతులసి, మున్సిపల్ చైర్ పర్సన్, సత్తెనపల్లి

బృహత్తర అవకాశం



కొన్నేళ్లుగా పన్ను చెల్లించని వారు ఈ బృహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 31 వరకు పన్ను చెల్లించే సదుపాయం ఉంది. ఇప్పటికే ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో, పుర సేవ యాప్, సంబంధిత వెబ్‌సైట్ ద్వారా పన్నులు చెల్లించవచ్చు. సెలవు రోజుల్లో కూడా పన్ను చెల్లించే అవకాశం కల్పించాం.

– కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి.

క్లుప్తంగా

ఎమ్మెల్యే నంబూరును కలిసిన వక్ఫ్‌బోర్డు డైరెక్టర్



క్రోసూరు: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ అబ్దుల్ రహీం శనివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలుసుకున్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ధన్యవాదాలు చెప్పారు. జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలోని ఆస్తుల పరిరక్షణకు తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట బెల్లంకొండ ఎంపీపీ పద్మా వెంకటేశ్వర రెడ్డి, దొడ్లేరు వైఎస్సార్ సీపీ నాయకులు మర్రి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామ జెడ్పీ పాఠశాల 1992–97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు శనివారం నిర్వాహక కమిటీ తెలిపింది. అప్పటి గురువులను, విద్యార్థులను కుటుంబ సమేతంగా ఆహ్వానించినట్లు వెల్లడించింది.

దమ్మాలపాడులో సినిమా షూటింగ్

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో శ్రీగణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న కాశీ నగర్ 1947 సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మిస్తున్న సినిమాలోని కర్రసాము పోటీలు గ్రామంలోని శిరిగిరిగోపాలరావుకు చెందిన రైస్ మిల్లులో శనివారం చిత్రీకరించారు. హీరో దిలీప్‌రాథోడ్, విలన్ వల్లెంచెన్న కేశవరావు, జబర్దస్త్ కళాకారుడు చిట్టిబాబు, పలువురు కళాకారులు పాల్గొన్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం చిత్తజల్లు ప్రసాద్, సంగీతం లక్ష్మణసాయి.

68 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు శనివారం 68 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని సీఎస్‌జీఎల్‌ఎం, శ్రీవాసవి, వృందా, రామకృష్ణాపురంలోని గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,204 మంది హాజరు కావాల్సి ఉండగా 1,136 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా కమిటీ సందర్శించింది.

జగనన్న కాలనీ సందర్శన

క్రోసూరు: క్రోసూరులోని జగనన్న కాలనీని ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి శనివారం సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. రోడ్లు, విద్యుత్, నీరు తదితర సౌకర్యాల కల్పనపై విచారించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి కాలనీలోని ప్రధాన రోడ్డుకు కలుపుతూ లింకు రోడ్డు వేయాలని ఆయనను కోరారు. లింకు రోడ్డుతో కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లి ప్రణాళిక చేపడతామని చెప్పారు. ఆయనతో పాటు యార్డు డైరెక్టర్ షేక్ సుభాని ఉన్నారు.

విపత్తుల నిర్వహణ నిధికి రూ.28 వేలు



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రగతి హై స్కూల్ నేషనల్ గ్రీన్ కాప్స్(ఎన్‌జీసీ)) విద్యార్థులు చదువులో భాగంగా కొన్ని వస్తువులు తయారు చేసి, వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన రూ.28 వేలు జాతీయ విపత్తుల నిర్వహణ నిధికి కేటాయించారు. సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌కు శనివారం నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ కో–ఆర్డినేటర్స్ రూబీ హెప్సిబా, ఆదం షఫీ, ఏఓ మంగెన పూడి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో ఆధార్ సేవలు



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ఇరుకు పాలెం గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ద్వారా శనివారం సేవలందించారు. మండల పరిధిలో ఐదు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి, సేవలందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆధార్‌లో సవరణలు, పేరు మార్పులాంటి సేవలందించటం జరిగిందన్నారు. 20న రుద్రవరం, 27న తొండపి, 28న లంకెలకూరపాడు, 29న చాగంటివారిపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేతి వెంకన్న దర్శనం..పూర్వజన్మ సుకృతం

- వైభవంగా నేతి వెంకన్న స్వామి తిరునాళ్ల
- దర్శించుకున్న మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు


పూజా కార్యక్రమాల్లో మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు

రాజుపాలెం: దశావతారాల్లో మొదటిది మత్స్యావతారంలో స్వయంభూగా వెలసిన నేతివెంకన్న స్వామిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని దేవరంపాడు కొండపై నేతి వెంకన్న స్వామి 4వ శనివారం తిరుణాళ్ల అత్యంత వైభవంగా జరిగింది. తిరుణాళ్లకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో కలసి మంత్రి రోజా విచ్చేశారు. మంత్రులకు వేద పండితులు, దేవాలయ కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి రోజా విలేకర్లతో మాట్లాడుతూ.. మంత్రి అంబటి రాంబాబు ఆహ్వానం మేరకు స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి అంబటి రాంబాబు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తమ అదృష్టం మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దొరకడమన్నారు. ప్రజలు, భగవంతుని ఆశీసులు తమపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి రోజూ స్వామివారిని భక్తులు దర్శించుకునేలా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానాల స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్, అచ్యుత శివప్రసాద్, రాయపాటి పురుషోత్తం, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఈదురు గాలులు.. తడిచిన మిరపకాయలు


వర్షానికి కల్లాల్లో తడిచిపోయిన మిరపకాయలు

రాజుపాలెం: మండలంలో ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొండమోడు నుంచి రాజుపాలెం వరకు మాచర్ల– గుంటూరు రహదారిపై చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. మామిడి, మునగ తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. అకాల వర్షానికి ..నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. అంచులవారిపాలెం, అనుపాలెంలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. ఆదివారం మరామ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తామని ఏఈ వీవీ ప్రసాద్ తెలిపారు.

ఉగాది పురస్కారాలకు ఇరువురి ఎంపిక


మంచికంటి వెంకటేశ్వరరావు


జింకా రామారావు

సత్తెనపల్లి: ఉగాది పురస్కారాలకు సత్తెనపల్లి నుంచి ఇరువురు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన సాహితీవేత్త, రిటైర్డ్ తెలుగు పండితుడు మంచి కంటి వెంకటేశ్వరరావు, ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావును ఎంపిక చేశారు. వారి ఇరువురికి అధికారికంగా ఉత్తర్వులు అందనున్నాయి. కొత్తగా ఏర్పాటైన పల్నాడు జిల్లాలో ప్రముఖులను గౌరవించాలనే యోచనలో భాగంగా ఇరువురిని ఎంపిక చేసి సత్కరించనున్నారు. ఈ నెల 22న నరసరావుపేటలో జరిగే కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రభుత్వం తరపున వీరిని సత్కరించనున్నారు.

వాటర్ గ్రిడ్‌తో తీరనున్న నీటి సమస్య


రేమిడిచర్ల గ్రామంలో ఓహెచ్‌బీఆర్ కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

బొల్లాపల్లి: వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా ఉంటుందని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ కె.ఎస్.హెచ్.హెచ్.కుమార్‌రాజు చెప్పారు. మండలంలోని రేమిడిచర్లలో ఓవర్ హెడ్ బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్ (ఓహెచ్‌బీఆర్) నిర్మాణానికి స్థల పరిశీలన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుంచి కృష్ణానది నీటిని మాచర్ల, కారెంపూడి మీదుగా నియోజకవర్గంలోని ప్రతి మండలానికి తరలించి మంచినీటి కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వ్యయం రూ.1200 కోట్లు అని చెప్పారు. ప్రతి మండలంలో సర్వే జరుగుతుందని, సర్వే అనంతరం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా పనులు చేపడతారని వివరించారు. స్థల పరిశీలనలో ఏఈ పి.సురేష్, గ్రామసర్పంచి వి.బ్రహ్మనాయక్ పాల్గొన్నారు.

బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ

కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ చుక్కా చంద్రపాల్


మాట్లాడుతున్న చుక్కా చంద్రపాల్, పక్కన నాయకులు

సత్తెనపల్లి: పేద, బడుగు, బలహీన వర్గాలను వదిలేసి ఆదానీ, అంబానీ లాంటి వాళ్ల అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ తోడ్పడటం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజక వర్గ కో–ఆర్డినేటర్ చుక్కా చంద్రపాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశం శనివారం జరిగింది. చంద్రపాల్ మాట్లాడుతూ ఎల్ఐసీ, ఎస్‌బీఐ ధనాన్ని దారి మళ్లించడం మంచిది కాదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో కో–ఆర్డినేషన్ కమిటీ వేసి, రాహుల్ గాంధీ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని కేడర్‌కు సూచించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెరిగిపోయి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని విమర్శించారు. సీనియర్ నాయకులు అజీమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జానీ ఖాజా వలి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి, నకరికల్లు ప్రెసిడెంట్ బొక్క చిన్న గురువు, పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి ఆర్కే మూర్తి, చాన్ బాషా, ముప్పాళ్ళ ప్రెసిడెంట్ కోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని 204ఏ శ్రీనివాస డైమండ్ క్లబ్ ఆధ్వర్యంలో సెక్రటరీ వనమా నాగేశ్వరరావు శ్రీ వాసవి మాత అన్న ప్రసాద వితరణ పథకం ద్వారా పట్టణంలోని 21 మంది నిరు పేదలకు శనివారం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు కటకం శ్రీనివాసరావు, పెరుమాళ్ల శ్రీనివాసరావు తదితర సభ్యులు ఉన్నారు.

గ్లాకోమా.. అవగాహన ర్యాలీ



సత్తెనపల్లి: గ్లాకోమా వ్యాధి వల్ల చూపు పోతే తిరిగి రాదని పట్టణ ఎస్ఐ ఎ.రఘుపతి అన్నారు. ధూళిపాళ్లలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం గ్లాకోమా (నీటి కాసుల) అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ గ్లాకోమా వంశపారంపర్యం కావొచ్చునని, ప్రమాదాన్ని తెలుసుకొని ముందస్తు చికిత్స పొందాలన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ విజన్ సెంటర్ కో–ఆర్డినేటర్ బి. మల్లేష్, ఏఎస్ఐ రవికుమార్, ప్రిన్సిపల్ విశ్వనాథ్, ఎడ్యుకేట్ ది సొసైటీ ప్రెసిడెంట్ షేక్ అన్సారీ, డాక్టర్ అర్పిత, అడ్మినిస్ట్రేటర్ జె.పాపయ్య, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మాదలలో ఫ్యామిలీ పిజీషియన్



కంకణాలపల్లిలో డాక్టర్ ప్రదీప్

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం శనివారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఎన్.సూర్యప్రకాశరావు 72 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.జోస్పిన్‌రాణి, పీటర్‌డానియేల్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

164 మందికి సేవలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ కంకణాలపల్లి లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 164 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్(ఎం) పి.మణి రావు, హెచ్‌వీకే వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ డి.తిరుమలవేణి, ఎంపీహెచ్ఏ(ఎఫ్) షేక్. మస్తాన్‌బీ, ఆశ కార్యకర్తలు ఎస్‌వీవీ రమాదేవి, ఎం.లక్ష్మి, ఎం.నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆశ వర్కర్ మృతి



నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు గ్రామం వద్ద గుంటూరు– కర్నూలు రహదారిపై శనివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ ఆశ వర్కర్ మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపిన వివరాలు.. ఏల్చూరు గ్రామంలో ఆశ వర్కర్లుగా పనిచేస్తున్న గుంటూరు లక్ష్మి, ప్రత్తిపాటి శాంతి స్కూటీపై నరసరావుపేట ఏరియా వైద్యశాలకు వచ్చి గర్భిణులకు కావాల్సిన మందులు తీసుకొని తిరిగి గ్రామానికి వెళుతుండగా వినుకొండ వైపు నుంచి నరసరావుపేటకు వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి మృతిచెందగా శాంతికి గాయపడింది. మృతురాలి భర్త జగన్‌మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం



నకరికల్లు: గుర్తు తెలియని మహిళ మృతదేహం గుంటూరు బ్రాంచి కాలువలో లభ్యమైనట్లు ఎస్ఐ పి.సురేష్ ఆదివారం తెలిపారు. మృతదేహం మెయిన్ కెనాల్ ద్వారా జీబీసీ కెనాల్‌కు కొట్టుకొచ్చినట్లు గుర్తించామన్నారు. మహిళ కాళ్లకు పట్టీలు ధరించి ఉండగా.. ఇప్పటికే శరీరం మొత్తం ఉబ్బిపోయి ఉండడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా మారిపోయింది. ఈ విషయమై విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి


సముద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు మధు తదితరులు

నాదెండ్ల: పేద, దళిత రైతులు సాగు చేసుకుంటున్న భూములను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆయా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని సీపీఎం సీనియర్ నాయకుడు పి.మధు కోరారు. మండలంలోని గొరిజవోలు గ్రామాన్ని శనివారం సందర్శించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకులు దావల సముద్రయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, సముద్రయ్య మూడు దశాబ్దాల క్రితం గ్రామంలో దళితులు సాగు చేసుకునే భూములను పెత్తందారులు కాజేసే యత్నాన్ని అడ్డుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నీరు–చెట్టు పేరుతో పేదలు సాగు చేసుకునే భూముల్లో మట్టి తవ్వకాలు చేశారని మండిపడ్డారు. నాడు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకోవటంతో అప్పట్లో మట్టితవ్వకాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో భూములు సాగు చేసుకుంటున్న పేద దళిత రైతులకు అన్యాయం జరగకుండా వారి పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. గొర్రెపాటి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దావల సముద్రయ్య జ్ఞాపకార్థం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఎం జెండాను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మేశ్వరరెడ్డి, అధ్యక్షులు కారసాల రోశయ్య, చిలకలూరిపేట సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

వినుకొండ టౌన్: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత–2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన పారిశుద్ధ్య మహిళా కార్మికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త వినియోగం వంటి విభాగాలలో కృషి చేస్తున్న మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గుండయ్యతోటకు చెందిన అన్నలదాసు సుబ్బారావు(37) ఈ నెల 10వ తేదీ ఆర్థిక ఇబ్బందులతో వంటిపై కిరోసిన్ పోసుకొని ఇంటి బయట నిప్పంటించుకున్నాడు. గమనించిన భార్య స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి ముస్లింల ఆరామక్షేత్రం

నరసరావుపేట: స్థానిక బాబాపేటలోని ముస్లింల శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన ముస్లిం ఆరామక్షేత్ర సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలోని బరంపేట మిట్టబజార్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి అనారోగ్యంతో మృతి చెందాడు. సొంత ఇల్లులేని కారణంగా ముస్లిం ఆరామ క్షేత్ర సహాయంతో బంధువులు శనివారం అంత్యక్రియలు నిర్వహించుకున్నారు. వారి మట్టి ఖర్చుల నిమిత్తం ముస్లిం ఖబరస్థాన్ అభివృద్ధి కమిటీ రూ.10వేలు ఆర్థిక సహాయం చేసింది. ఎవరైనా పేదలు ఉంటే ఆరామక్షేత్రం ఉపయోగించుకోవాలని ఖబరస్తాన్ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా, సెక్రటరీ సయ్యద్ జాఫర్ తెలిపారు. ముస్లింలకోసం ఆరామక్షేత్రం నిర్మించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు, మృతిచెందిన మస్తాన్‌వలి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.


ఆరామక్షేత్రంలో మృతదేహంతో ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షులు, మృతుని బంధువులు

ముగ్గురిపై దాడి కేసు నమోదు

యడ్లపాడు: బోయపాలెం గ్రామానికి చెందిన ఎం.రవీంద్ర నాయక్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని బ్రిక్ కంపెనీ యజమాని వి.శ్రీనుబాబు, కంపెనీలో గుమస్తా అయిన ఎం.రవీంద్రనాయక్‌ను ఇటీవల రూ.83,500 డబ్బులు వసూలుకు పంపించారు. అక్కడ నగదు వసూలు చేసి, వాటితో కనిపించకపోవడంతో నిర్వాహకులు, పోలీసులకు మౌఖికంగా తెలియజేసి వెతుకులాట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి బోయపాలెంలో ఉన్నట్లు గుర్తించి నగదు ఇవ్వాలంటూ నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అతడిపై శ్రీనుబాబుతో మరో ఇద్దరు దాడి చేశారు. పోలీసులకు అప్పగించారు. గాయాలైన రవీంద్రను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన చికిత్సకు గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ పైడి రాంబాబు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.